క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: స్థానిక పామర్రు రోడ్‌లో నిర్మిస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులలో భాగంగా ఆదివారం పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ టి.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు ఆటోనగర్, ఆర్టీసీ కాలనీ, బ్యాంక్ కాలనీ, చౌదరిపేట, లక్ష్మీనగర్ కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పుస్తకాల పంపిణీ



మండవల్లి: చిన్నారులందరినీ బడిలో చేర్పించి వారికి విద్య అందించాలని మండవల్లి సర్పంచ్ మెండా ఝాన్సీ, మాజీ సర్పంచ్ గుడివాడ చిట్టిబాబు కోరారు. మండవల్లి ప్రాథమిక పాఠశాల–2లో పాఠ్య, నోట్ పుస్తకాలతో పాటు, విద్యాసామగ్రి కిట్‌లను శనివారం పంపిణీ చేశారు. మెండా సురేష్, హెచ్‌ఎం రాహేల్, ముళ్లపూడి సత్తిబాబు, నల్లిబోయిన రాజేష్, కారి రాజు, విద్యా కమిటీ చైర్మన్ పాల్గొన్నారు.

గ్రేడ్‌-5 కార్యదర్శులకు పంచాయతీల కేటాయింపు

పమిడిముక్కల: మండల పరిధిలోని సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్‌–5 పంచాయతీ కార్యదర్శులను గ్రామ పంచాయతీలకు కేటాయించి డీడీఓ అధికారాలు, పరిపాలనా విధులు కేటాయించినట్లు ఎంపీడీఓ సుభాని తెలిపారు. మద్రివాడకు వి.తులసి, ఐనంపూడికి ఎ.హేమంత్, వీరంకి ఆర్.విజయలక్ష్మి, అలీనఖీపాలెంకు కె.జగదీష్, గోపువానిపాలెంకు ఎస్‌కే ఆషా, ముళ్లపూడికి పి.కృష్ణకుమారి, ఫత్తేలంకకు ఎస్.అభిలాష్, మామిళ్లపల్లికి జి.మౌనిక, పెనుమత్సకు కె.అశ్విని, కూడేరుకు ఎల్.నాంచారయ్య, శ్రీరంగపురానికి వి.బాబులను నియమించినట్లు తెలియజేశారు.

వైభవంగా శాంతి కల్యాణం



కురుమద్దాలి(పామర్రు): గ్రామంలో భూ దేవి సమేత చెన్న కేశవ స్వామి ఆలయంలో వార్షిక కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ఉదయం ఆలయంలో ఉత్సవ మూర్తులను పెండ్లి కుమారులుగా అలంకరించి విశేష పూజలు చేశారు. సాయంత్రం ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో చెన్న కేశవ స్వామి వార్లకు శాంతి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ముత్తేవి మాధవ కుమార్ నిర్వహించారు. కోటి నాగమహేశ్వరరావు, దుర్గా నాంచారమ్మ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు పాల్గొని స్వామివార్ల కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి, సిబ్బంది కె.ప్రభాకర్‌రెడ్డి, అర్చకులు ముత్తేవి ప్రసాద్, ఎం.శ్రీకుమార్, స్థానికులు కొసరాజు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగుచేయాలని వినతి



నిభానుపూడి(పామర్రు): మండల పరిధిలోని నిభానుపూడి గ్రామం నుంచి నిమ్మకూరు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి గోతుల మయంగా మారింది. నిభానుపూడి నుంచి ప్రతి రోజూ అనేక మంది విద్యార్థులు నిమ్మకూరు హైస్కూల్‌లో చదువుకునేందుకు వెళ్లాల్సి వస్తుంది. రహదారి గోతుల మయంగా మారటంతో రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా ఉంటోందని వారు వాపోతున్నారు. దీనిపై మట్టి టిప్పర్లు, ట్రాక్టర్లు అనేకం తిరగటం కారణంగా రహదారి పూర్తిగా పాడైపోయింది. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని స్థానికులు, విద్యార్థులు కోరుతున్నారు.

కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు

గుడివాడ టౌన్: స్థానిక నాగవరప్పాడు వాసవీ నగర్‌లో వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఫణీంద్రాచార్యులు మాట్లాడుతూ జ్యేష్ఠపౌర్ణమి పురస్కరించుకుని అమ్మవారికి అర్చనలు చేయడం వలన సమాజం క్షేమంగా ఉంటుందన్నారు. వర్షాలు మెండుగా కురిసి రైతులు సుభిక్షంగా ఉంటారన్నారు. అందులో భాగంగా శనివారం అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లోయ వరాలు, భక్తులు పాల్గొన్నారు.

కూరగాయల చూపు..ఆకాశం వైపు



ఆందోళనలో ప్రజలు

మార్కెట్‌లో కూరగాయల ధరలు (కిలో..)	
వంకాయలు	రూ.38
టమాటా	రూ.65
బెండకాయలు	రూ.36
బీరకాయలు	రూ.50
బంగాళాదుంపలు	రూ.37
ఉల్లిపాయలు	రూ.37
చిక్కుడు	రూ.98
పచ్చిమిర్చి	రూ.41
దొండకాయలు	రూ.36
క్యాబేజీ	రూ.30
క్యారెట్	రూ.45
దోసకాయలు	రూ.26
కాకరకాయలు	రూ.54
వెల్లుల్లి	రూ.225

గుడివాడరూరల్: కూరగాయల ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. ఈ ఏడాది దిగుబడులు తగ్గడం, రవాణ చార్జీలు పెరగడం ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు పేర్కొంటున్నారు. అయితే పంటలు పండిస్తున్న రైతులకు ఏమాత్రం గిట్టుబాటు ధర లభించడంలేదంటున్నారు. అమాంతం పెరిగిన కూరగాయల ధరలతో సామాన్యులు కూరగాయలు కొనుగోలు చేసి తినడానికి భయపడుతున్నారు. కూరగాయలను రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి తీసుకువచ్చే దళారులు అధిక ధరలు వినియోగదారులపై వేస్తున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి వినియోగదారులకు విక్రయించే సమయంలో అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారు. అమాంతంగా పెరిగిన ధరలతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ధరల పెరుగుదలను నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.



ఇబ్బందులు తప్పడం లేదు..



అమాంతంగా పెరిగిన కూరగాయల ధరలతో ఇబ్బంది పడుతున్నాం. కుటుంబ ఖర్చులు పెరుగుతున్నా..తప్పడం లేదు. కూరగాయలకు బదులు ఆకుకూరలతో సరిపెట్టుకుంటున్నాం. అధికారులు ధరలు నియంత్రించాలి.

–బి.విజయ, గృహిణి

దడ పుట్టిస్తున్న ధరలు..



రోజు రోజుకూ పెరుగుతున్న కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. దళారుల కారణంగానే ధరలు పెరుగుతున్నాయి. రైతులకు ఏమాత్రం కలసి రావడం లేదు. ఏ రోజుకారోజు పెరుగుతున్న టమాటా ధర ప్రజలను భయపెడుతోంది.

–జే.విఘ్నేష్, వినియోగదారుడు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

డీఎస్పీ శ్రీకాంత్

గుడివాడరూరల్: మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని డీఎస్పీ పి.శ్రీకాంత్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాలు వినియోగిస్తే జరిగే అనర్థాలపై టూటౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో డీఎస్పీ శనివారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు వ్యవసాలకు దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసలుగా మారకుండా ఉండాలన్నారు. క్రమ శిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. గుడివాడ సబ్ డివిజన్‌లో ఎక్కడైనా నిషేధిత గంజాయి, డ్రగ్స్, కొకైన్, హెరాయిన్ తదితర మత్తు పదార్థాలు విక్రయిస్తే ఆయా ప్రాంతాల్లో ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సూచించారు. ఎవరైనా విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం మత్తు పదార్థాలకు బానిసలుగా మారితే జీవితాలు ఏవిధంగా నాశనమవుతాయనే అంశాల గురించి వీడియో రూపంలో విద్యార్థులకు చూపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీకాంత్

సమస్యలపై స్పందించాలని ఎమ్మెల్యే ఆదేశం

గుడివాడ టౌన్: పట్టణంలో ప్రజలకు ఇబ్బంది కలిగే సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద నిల్వ ఉన్న నీటిని తొలగించాలంటూ ప్రజలు తమ దృష్టికి తెచ్చారని వెంటనే స్పందించి నీటిని తొలగించాలని ఆయన అధికారులకు సూచించారు. సమస్యను బట్టి అధికారులు స్వయం నిర్ణయం తీసుకుని పరిష్కరించవచ్చని, ఇతర అధికారుల సూచనల కోసం ఎదురు చూస్తే సమస్యలు పరిష్కారం కావని ఆయన అధికారులకు తెలిపారు.



బస్టాండ్ ఎదుట రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

సామాజిక తనిఖీపై సదస్సు

ముదినేపల్లి రూరల్ : మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ కార్యక్రమాలు సోమవారం నుంచి జరుగుతాయని పథకం రాష్ట్ర స్థాయి రీసోర్స్ పర్సన్లు పేర్కొన్నారు. సామాజిక తనిఖీకి సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీల కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పథకం సిబ్బందితో అవగాహన సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రీసోర్స్ పర్సన్ కృపాకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు సంబంధించి ప్రతి గ్రామంలో నాణ్యత ప్రమాణాలు పరిశీలించేందుకు తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఈవోఆర్డీ డి.లక్ష్మీనారాయణ, మండల పరిషత్ ఏవో రమణబాబు, ఉపాధి హామీ పథకం ఏపీవోలు నాగరాజు, దయానందరాజు, డీఆర్పీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉపాధి హామీ పథకం రీసోర్స్ పర్సన్

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

ముదినేపల్లి రూరల్ : విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసేవారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని వడాలి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.ప్రభుదాస్, మాజీ హెచ్‌ఎం బీఎస్ నాగేశ్వరరావు అన్నారు. ఈ హైస్కూల్లో సోషల్ సబ్జెక్టు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న అనురాధ శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా అనురాధ, లక్ష్మణరావు దంపతులను సీనియర్ ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు మెమెంటోలు, శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.



ఉపాధ్యాయురాలు అనురాధ దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

విద్యను ప్రోత్సహించడం బాధ్యత

గుడివాడ టౌన్: విద్యను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శ్రీరామ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ పొట్లూరి వంశీకృష్ణ అన్నారు. శనివారం స్థానిక ఐఎంఏ హాలులో ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పొట్లూరి గంగాధరరావు జ్ఞాపకార్థం ద్రోణాచార్య అవార్డ్ ఆఫ్ 2023–24 పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో అధిక మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులకు ఆయన నగదు ప్రోత్సాహం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘ పాఠశాలల్లో చదువుతున్న సాధారణ విద్యార్థులు 10వ తరగతి పరీక్షల్లో ప్రతిభను ప్రదర్శించి నూరుశాతం మార్కులు సాధించిన వారు, మొదటి రెండు స్థానాలు సాధించిన బాలబాలికలకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున 20 మందికి రూ.4 లక్షల నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వసుంధర, డాక్టర్ శారద, డీవైఈఓ పద్మరాణి, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, బహుమతి సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



పురస్కారం అందుకున్న విద్యార్థులతో డాక్టర్ వంశీకృష్ణ తదితరులు

వరి సాగు పనులు ముమ్మరం

పామర్రు: తొలకరి వర్షాలు పలకరించడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తమయ్యారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు, బోదుల ద్వారా జాలుగా వస్తున్న సాగునీటికి భూమి పదునెక్కింది. దీంతో రైతులు వరి సాగు పనులు చేపడుతున్నారు. ఇప్పటికే వేసవి దుక్కులు చేసి సిద్ధంగా ఉన్న పొలాల్లో వరి నారుమళ్లు పోసేందుకు సిద్ధం అవుతున్నారు. వాతావరణం అనుకూలంగా మారడంతో రైతులు పొలం పనులలో బిజీ బిజీగా ఉంటున్నారు. నారుమళ్లకు నీరు పెట్టి రోటోవీటర్ సహాయంతో మరలా పొలాన్ని దమ్ము చేస్తున్నారు. వరి విత్తనాలు 1061, 1070 ఎర్రకరం (బీపీటీ) రకం విత్తనాలను 24 గంటలు నానబెట్టి దంప మడి పద్ధతిలో నారుమళ్లు పోసుకునేందుకు పొలాల్ని చదును చేస్తున్నారు. వాతావరణం అనుకూలంగా మారడంతో రైతులు, రైతు కూలీలు ఉదయం నుంచి సాయంత్రం వరకూ పొలాల్లోనే కనిపిస్తున్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు కరువు

ఖరీఫ్ సాగు ప్రారంభం అవుతున్నా గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారుల సూచనలు కరువయ్యాయి. గతంలో ఖరీఫ్ సీజన్ ముందు గ్రామాల్లో రైతు చైతన్య యాత్రలు నిర్వహించేవారు. సాగులో తీసుకోవాల్సిన సూచనలు, సలహాలను వ్యవసాయశాఖ అధికారులు చెప్పేవారు, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని పలువురు రైతులు వాపోతున్నారు. వ్యవసాయాధికారులు స్పందించి అధిక దిగుబడుల సాధనకు సూచనలు సలహాలను అందజేయాలని రైతులు కోరుతున్నారు.



దంపమడిని రోటోవీటర్‌తో పొలం చదును చేస్తున్న దృశ్యం

ఆర్బీకేల్లో సబ్సిడీపై వరి విత్తనాలు

పెదన: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో బీపీటీ–5204, ఎంటీయూ–1224 రకాల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని పెదన ఏవో జీవీ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా 90 క్వింటాళ్ల బీపీటీ –5204, 60 క్వింటాళ్ల ఎంటీయూ –1224 వచ్చాయన్నారు. కేజీకి ఐదు రూపాయల చొప్పున సబ్సిడీ ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. 25 కేజీల బ్యాగులు వచ్చాయని ఒక్కో రైతుకు 2.5 ఎకరాల వరకు విత్తనాలను అందిస్తామని తెలిపారు. 25 కేజీల బీపీటీ అసలు ధర రూ.1045 కాగా సబ్సిడీ రూ.125 అని, సబ్సిడీ పోను రూ.920కు 25కేజీల బ్యాగు బీపీటీ వరి విత్తనాలను రైతుకు ఇస్తామని వివరించారు. ఎంటీయూ –1224 వరి విత్తనాలు 30 కేజీల బ్యాగు ధర రూ.1254 ఉందని, సబ్సిడీ రూ.150 పోను రూ.1104కు రైతుకు ఇస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు.

క్రమశిక్షణతో విద్యను అలవర్చుకోవాలి

- సీడీపీవో విజయ ఫ్లోరెన్స్
- ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

గుడివాడరూరల్: చిన్న వయస్సు నుంచే క్రమశిక్షణ, అంకితభావంతో కూడిన విద్యనభ్యసించడం ద్వారా జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదుగుతారని ఐసీడీఎస్ సీడీపీవో విజయఫ్లోరెన్స్ పేర్కొన్నారు. పట్టణంలోని యానాదికాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో సీడీపీవో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రీ ప్రైమరీ విద్య పూర్తి చేసుకుని 5 సంవత్సరాలు నిండిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలతో కూడిన పౌష్టికాహారంతో పాటు మెరుగైన విద్యను కూడా అందిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు అందరూ చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్స్ బీకేడీ భవానీ, ఆరీఫా, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.గీత, ఎం.స్వప్న, సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెదపారుపూడి: మండలంలోని పాములపాడు దూళ్ళవానిగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్‌డే ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ప్రత్తిపాటి హర్షవర్ధన్ మాట్లాడుతూ అంగన్‌వాడీ చిన్నారుల వయస్సు తగిన విధంగా విద్యను బోధించాలన్నారు. పెదపారుపూడి సెక్టార్ సూపర్‌వైజర్ జి.అరుణ మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలందరూ ఉన్నత విద్య అభ్యసించడానికి గ్రాడ్యుయేషన్ డే నిర్వహించటం జరిగిందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు జయప్రద, లీల, అన్నపూర్ణ, కృపావరం, తదితరులు పాల్గొన్నారు.

పమిడిముక్కల: మండలంలోని అలీనఖీపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే, అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల వయస్సుకు తగ్గట్టుగా విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి సర్టిఫికెట్లు అందజేసి పాఠశాలలో చేర్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనుమూరు(పామర్రు): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మంచి క్రమశిక్షణతో పాటు అనుబంధ పోషకాహారం అందిస్తామని ఐసీడీఎస్ పామర్రు ప్రాజెక్టు సీడీపీవో వి.భానుశ్రీ అన్నారు. మండల పరిధిలోని కనుమూరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో మన అంగన్‌వాడీ పిలుస్తోంది వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రాడ్యుయేషన్‌డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు ఏళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీలలో పిల్లల పోషణ ఆరోగ్య స్థాయి మెరుగుపరచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పిల్లలకు ఆట పాటలతో విద్యను అందించడం ద్వారా బడి మానకుండా నూరు శాతం హాజరు వచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఐదేళ్ల నిండిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించి వారికి సర్టిఫికెట్లను అందజేశారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో వారిని చేర్పించామని తెలిపారు. సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి, గ్రామ సర్పంచ్ కొడాలి సుఖవేణి, స్థానిక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు జె.స్వరూపరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు వీ పుష్పావతి, కె.ప్రసన్న, సహాయకులు వీ అమరేశ్వరి, శోభన కుమారి, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో సీడీపీవో విజయఫ్లోరెన్స్



గ్రాడ్యుయేషన్ డేలో సర్పంచ్ ప్రత్తిపాటి హర్షవర్ధన్, సూపర్‌వైజర్ అరుణ



అలీనఖీపాలెంలో గ్రాడ్యుయేషన్ డేలో సిబ్బంది



కనుమూరులో విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న సీడీపీవో భానుశ్రీ

అన్నసమారాధన



ముదినేపల్లి రూరల్ : శ్రీహరిపురం శివారు అయినంపూడి బలుసులమ్మ ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. బలుసులమ్మతల్లి జాతర మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా శనివారం అన్నసమారాధన కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు కొడాలి వినోద్, వీరమల్లు నరసింహారావు, శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు ప్రారంభించారు. ఈ సమారాధనకు సింగరాయపాలెం–చేవూరుపాలెం స్తంభం చెరువు తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

బొకేలు, దండలు వద్దు

–ఎమ్మెల్యే కామినేని

కైకలూరు: నాయకులు, అభిమానులు కలవడానికి వచ్చేటప్పుడు బొకేలు, దండలకు బదులు విద్యార్థులకు ఉపయోగపడే నోటు పుస్తకాలు, పెన్నులు వంటివి తీసుకురావాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సూచించారు. పాఠశాలలు తెరిచిన సందర్భంగా నోటు పుస్తకాలు పేద విద్యార్థులకు ఉపయోగపడతాయన్నారు. కార్యాలయ సిబ్బంది మాట్లాడుతూ ఆది, సోమవారాల్లో ఉదయం నుంచి ఎమ్మెల్యే కామినేని, వరహాపట్నం ఇంటి వద్ద ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. సోమవారం సాయంత్రం 5 గంటలకు మండవల్లి మండలం లోకుమూడి గ్రామ ఎన్‌డీఏ కార్యాలయం వద్ద నియోజకవర్గ స్థాయి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారన్నారు. నియోజవవర్గంలో నాయకులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీలను సద్వినియోగం చేసుకోవాలి



తోట్లవల్లూరు: అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బొడ్డపాడు సర్పంచ్ మూడే శివశంకర్ సూచించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మన అంగన్‌వాడీ పిలుస్తోంది, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు శనివారం ఘనంగా జరిగాయి. సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత, ఎంపీయూపీ పాఠశాల హెచ్‌ఎం జయరాజు, ఉపాధ్యాయురాలు సుమలత, అంగన్‌వాడీ కార్యకర్తలు సుధ, భాను పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

నేడు ప్రమాణ స్వీకారం

కైకలూరు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ 2024–25 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కైకలూరు సీతారామ ఫంక్షన్ హాలులో ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు పొట్లూరి వీరశేషగిరిరావు హాజరవుతారని నిర్వాహకులు శనివారం తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి దంపతులకు గాయాలు

మల్లాయి చిట్టూరు(ఘంటసాల): బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వాహనం అదుపు తప్పి పడిపోయింది. దీంతో దంపతులు ఇరువురూ గాయాలపాలైన సంఘటన శనివారం జరిగింది. స్థానికులు అందించిన వివరాల మేరకు విజయవాడకు చెందిన నిట్టా నాగేశ్వరరావు, శ్యామల దంపతులు ఘంటసాల మండలం పూషడం గ్రామానికి చెందిన తోడల్లుడి ఇంట్లో ఫంక్షన్‌కు వస్తున్నారు. మార్గమధ్యంలో మల్లాయి చిట్టూరు గ్రామంలోని చెరువు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో వాహనంపై ఉన్న భార్యభర్తలిద్దరూ కింద పడిపోయి గాయాలపాలయ్యారు. స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిద్దరిని తమ వాహనాలపై పూషడం గ్రామంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి, అనంతరం వారి బంధువుల ఇంట్లో దించివెళ్లారు. తమకు చికిత్స చేయించి సాయం చేసిన గ్రామస్తులకు ఆ దంపతులిరువురూ కృతజ్ఞతలు తెలిపారు.